## క్లుప్తంగా

### మెగా రక్తదానశిబిరం రేపు

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో అన్ని శాఖల అధికారులతో ఈనెల 2న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ సంఘ అసోసియేట్ అధ్యక్షుడు నాగేనాయక్ తెలిపారు. శనివారం ఆయన సంఘ ప్రతినిధులు మధుబాల, అక్బర్‌అలీతో సమావేశమై మాట్లాడుతూ మున్సిపాలిటీ, పోలీస్, రెవెన్యూ, విద్యార్థులతో కలసి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే శిబిరంలో అధిక సంఖ్యలో దాతలు పాల్గొని రక్తదానం చేయాలన్నారు. దీనిని అవసరమైన బ్లడ్ బ్యాంకులకు తరలిస్తామని ఆయన తెలిపారు.

### కమనీయం.. శ్రీవారి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

సదుం: మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో ఆలయ 3వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అఖండ గోవింద నామస్మరణ, భజనలు చేశారు. ఆలయ ఆవరణలో వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పలు గ్రామాల్లో ఊరేగించారు. కర్పూర హారతులతో గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్తలు, దాతలు రవీంద్ర పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనం పెట్టాలి


రైల్వేస్టేషన్ క్రాస్‌లోని హోటల్ నిర్వాకులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

గుడుపల్లె: హోటళ్లలో నాణ్యమైన భోజనం, టిఫిన్ అందించాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అన్నారు. శనివారం మండలంలోని రైల్వేస్టేషన్ క్రాస్, గుడుపల్లెలో నిర్వహిస్తున్న హోటళ్ల యాజమానులకు నోటీసులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ హోటళ్లలో ఇడ్లీలకు ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. నూలుగుడ్డలను వేసి ఇండ్లీలు చేయాలన్నారు. హోటళ్లకు వచ్చే వారికి నాణ్యమైన భోజనం పెట్టాలని అన్నారు. కల్తీ పప్పులను వాడి అనారోగ్యం పాలైతే చర్యలు తీసుకుంటామని అన్నారు.

### చెరువు ఆక్రమణ తొలగింపు


ఆక్రమణను తొలగిస్తున్న జేసీబీ

చౌడేపల్లె: మండలంలోని పరికిదొన సమీపంలోని దారమారకుల ఒడ్డులోని ఆక్రమణను తహసీల్దార్ హనుమంతు నాయక్ ఆదేశాల మేరకు శనివారం అధికారులు తొలగించారు. గ్రామస్తుల ఫిర్యాదుపై స్పందించిన ఆర్‌ఐ సుధాకర్‌నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుంటలో ఓ రైతు ఆక్రమించి తమ పొలాలకు వెళ్లేందుకు కట్టను ఏర్పాటు చేశారని నిర్ధారించారు. జేసీబీ సాయంతో ఆక్రమణలను తొలగించి సమస్యను పరిష్కరించారు. వెంటనే స్పందించిన అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు


పట్టణంలో ఊరేగుతున్న స్వామివారు

కుప్పంరూరల్: ప్రబోధానంద సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కుప్పం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఊరేగింపుతో ముగిశాయి. 26న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా కుప్పం ప్యాలెస్ వద్ద స్వామి విగ్రహ ప్రతిమ ఏర్పాటు చేసి ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు శనివారం స్వామి వారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి పట్టణంలోని కృష్ణమందిరానికి చేరుకుంది.

### పీవీకేఎన్ విద్యార్థికి అభినందనలు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పీవీకేఎన్ విద్యార్థి వినయ్‌కుమార్ క్రీడల్లో ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఈమేరకు శనివారం ఆ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలో బీకాం చదువుతున్న వినయ్‌కుమార్ నేపాల్‌లో జరిగే టీ20 క్రికెట్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

# సీట్ అలాట్‌మెంటే మార్చేశారు!

- వెబ్ ఆప్షన్స్‌లో ఫోన్ నంబర్‌ను మార్చి సీట్లు దక్కించుకున్న వైనం
- ప్రైవేటు కళాశాలల తెలివికి ఔరా అంటున్న ప్రభుత్వ కళాశాలలు
- జరిగిన మోసంపై ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసిన బాధిత విద్యార్థులు
- పలమనేరులో వెలుగుచూసిన సీట్ల మార్పిడి మోసం



కళాశాల వెబ్ ఆప్షన్లలో మారిన విద్యార్థుల సెల్ నెంబర్లు

పలమనేరు: ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా వెబ్ ఆప్షన్ల ప్రక్రియతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో డిగ్రీ కోర్సుల్లో సీట్లను కేటాయిస్తోంది. ఇప్పటికే రెండు వెబ్ కౌన్సెలింగ్‌లు పూర్తికాగా మూడో వెబ్ కౌన్సెలింగ్ త్వరలో జరగనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు వెబ్ ఆప్షన్‌లో పెట్టుకున్న కాలేజీలు కాకుండా వేరే కాలేజీల పేర్లు రావడంతో వారు ఆశ్చర్యానికి గురయ్యారు. తమ ప్రమేయం లేకుండా ఇదంతా ఎలా సాధ్యమైందనే అనుమానం వారికి కలిగింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్లకు సైతం కొన్ని ప్రయివేటు కళాశాలల సిబ్బంది డమ్మీ స్టూడెంట్స్‌తో వారి వద్దనున్న మొబైల్ ఫోన్లు ఇచ్చి ఓటీపీ రాగానే ఆ డమ్మీ స్టూడెంట్స్ వెబ్ ఆప్షన్ మార్చేలా ఈ మోసం జరిగి ఉంటుందనే మాట వినిపిస్తోంది. పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెబ్‌ఆప్షన్ పెట్టుకున్న పదిమంది విద్యార్థులకు వారి ప్రమేయం లేకుండానే స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాలకు సీట్ అలాట్ అయినట్టు ఆన్‌లైన్‌లో చూపుతోంది. దీంతో విష్యయానికి గురైన వీరంతా శనివారం లిఖిత పూర్వకంగా కడప ఆర్‌జేడీ డా.బాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. ఇదే రీతిలో జిల్లాలోని పలు ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లోనూ మోసాలు సాగినట్టు ఈ సంఘటనను బట్టి అనుమానం కలుగుతోంది.

**ఇదిగో సాక్ష్యాలు..**

- బైరెడ్డిపల్లి మండలం ఆలపల్లికి చెందిన కే.వీణ బీఎస్సీ కోర్సులో చేరేందుకు సీటు కోసం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆప్షన్ పెట్టుకుంది. కానీ ఆ విద్యార్థికి పట్టణంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాల అలాట్ అయింది. ఇదేలా సాధ్యమైందని కనుక్కుంటే ఆమె రిజిస్ట్రేషన్‌లో పెట్టుకున్న ఫోన్ నంబర్ 6281067434 అయితే అక్కడ 7780661140గా ట్రాన్‌జాక్షన్ జరిగింది. ఈనంబర్ ఎవరిదని చూస్తే అది ప్రైవేట్ కళాశాల వాళ్లదిగా తేలింది. దీంతో బాధిత విద్యార్థి తనకు న్యాయం చేయాలంటూ ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసింది.
- బైరెడ్డిపల్లి మండలం జంబుగుండ్లపల్లికి చెందిన టి.అనిల్‌కుమార్ సెకెండ్ ఫేజ్ వెబ్ కౌన్సెలింగ్‌లో బీకాం(సీఏ) కోర్సుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సీట్ ఆప్షన్ పెట్టుకున్నాడు. కానీ అతనికి శ్రీవిద్య ప్రయివేట్ కళాశాల అలాట్‌మెంట్ చూపుతోంది. గమనించగా అతని ఫోన్ నంబర్: 93461 96096 కాగా వెబ్ ఆప్షన్లలో 88850 38247గా మార్చి ప్రయివేట్ కాలేజీకి సీటు దక్కేలా చేశారు.
- గంగవరం మండలం సరమట్లపల్లికి చెందిన ఎస్.దీప స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీబీఏ కోసం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ పెట్టుకుంది. తీరా చూస్తే ప్రయివేట్ కళాశాలకు సీట్ మంజూరైంది. తాను వెబ్ ఆప్షన్లలో పెట్టుకోకనే ప్రైవేటు కాలేజీలో తనకెలా సీటువచ్చిందా అని తాను విచారించింది. ఆన్‌లైన్‌లో చూస్తే ఆమె ఫోన్ నంబర్‌కు బదులు 8374696104గా మార్చి దానికొచ్చిన ఓటీపీ ఆధారంగా కాలేజీ అలాట్‌మెంట్ మార్చేశారు. ఇవి కొన్ని మాత్రమే. ఇదేవిధంగా ఈ కళాశాలలో పది మందికి పైగా ప్రయివేట్ కాలేజీలకు సీట్లు వెళ్లిపోయాయి. అసలే అడ్మిషన్లు తక్కువగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ప్రయివేట్ డిగ్రీ కళాశాలకు ఇలా మోసాలు చేసీ మరీ విద్యార్థులను చేర్చుకోవడం ఇప్పుడు హాట్‌టాపిగ్ మారింది. దీనిపై ఆర్‌జేడీ డా.బాబును వివరణ కోరగా ఫేక్ నంబర్ల ద్వారా పలమనేరు ప్రభుత్వ కళాశాల సీట్ అలాట్‌మెంట్లను ప్రైవేటు కళాశాలలు పొందినట్టు ఫిర్యాదులందిన మాట నిజమే. దీనిపై తాము ప్రాథమికంగా విచారిస్తే ఫోన్ నంబర్లు మార్చినట్టు తేలింది. దీనిపై విజయవాడలోని ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శితో మాట్లాడే ప్రయత్నాలు చేస్తున్నాం. వారు ఇంకా స్పందించలేదు.

**తమకు తెలియకనే కాలేజీ మార్చేశారు...**


నేను వెబ్ కౌన్సెలింగ్‌లో పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అలాట్ చేసుకుంటే ప్రైవేట్ కాలేజీ పేరు ఎలా వచ్చింది. నా సెల్ నంబర్ కాకుండా ఆ కాలేజీ వాళ్లకు సంబంధించిన వారితో తాను వెబ్ ఆప్షన్లు మార్చినట్టు ఆన్‌లైన్‌లో చేసుకున్నారు. దీనిపై న్యాయం కావాలని ఆర్‌జేడీకి పిర్యాదు చేశాను.
–వీణ, విద్యార్థిని

**ఓటీపీ సెల్‌కొచ్చేలా నంబర్ మార్చేశారు..**


నేను పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కోర్సుకు వెబ్ ఆప్షన్ పెట్టుకున్నా. ఇప్పుడు చూస్తే ప్రయివేటు కాలేజీ వస్తోంది. మేము ప్రయివేటు కాలేజీలో ఫీజులు కట్టలేమనే కదా ప్రభుత్వ కాలేజీకి పెట్టుకున్నాం. ఇలా మోసం చేస్తే ఎలాగా. అందుకే దీనిపై ఉన్నతాధికారులు న్యాయం చేయాలి.
–అనిల్‌కుమార్, విద్యార్థి

**కాల్‌సెంటర్‌కు డమ్మీ వారిని తీసుకెళ్లారేమో..**


ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెబ్ కౌన్సెలింగ్ సంబంధించి కాలేజీల మార్పు కోసం జిల్లా కేంద్రంలో కాల్‌సెంటర్ పెట్టారు. అక్కడికి స్టూడెంట్ వెళ్లాలి. తాము వెళ్లకనే ఎవరినో చూపించి నా సెల్ నంబర్‌లో వాళ్లది పెట్టి ఆ ఓటీపీని చెప్పి అలాట్‌మెంట్ మార్చేశారేమోననిపిస్తోంది. అధికారులు న్యాయం చేయాలి.
–దేవి, స్టూడెంట్

### బంగారు తాళిబొట్ల బహూకరణ


సదుం: తాళిబొట్లు అందిస్తున్న దాతలు

సదుం: మండలంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి దాతలు బంగారు తాళిబొట్లను బహూకరించారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. పాకాలకు చెందిన మౌళి, హైమ వీటిని అందించినట్టు చెప్పారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశామన్నారు.

### ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్

చౌడేపల్లె: కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని తహసీల్దార్ హనుమంతు నాయక్ సూచించారు. శనివారం నాయునివారిపాళ్యంలోని కమ్యూనిటీ భవనంలో పౌరహక్కులపై గ్రామసభను నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో వివక్షతకు తావులేకుండా అందరూ సమానంగా పరిగణించాలన్నారు. గ్రామంలో ఎలాంటి వివక్షతలు లేవని, గుడి, బడిల్లో అందరూ కలసిమెలసి తిరుగుతున్నామని ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఆర్‌ఐ సుధాకర్‌నాయక్, వీఆర్వో నాగేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

వి.కోట: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ బాబు సూచించారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో సిబ్బందితో కలసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ మొత్తం వాహనంలోనే పెట్టుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘిస్తే కొత్తగా అమలు చేసిన నిబంధనల ప్రకారం అధిక శాతంలో జరిమానాలు, జైలు శిక్షలు ఉంటాయని, నిబంధనలకు కట్టుబడి ఉండాలని ఆయన సందర్భంగా సూచించారు. వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు.

## కొళత్తూరులో పౌరహక్కుల దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న డీటీ రమేష్

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరు ఎస్సీ కాలనీలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన కాలనీ వాసులను ఉద్దేశించి డీటీ రమేష్ మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలు ఎస్సీ, ఎస్టీలు సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను శాఖల వారీగా నమోదు చేసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల ద్వారా కృషిచేస్తామని తెలిపారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్, ఎంఈఓ గోపాల్ రెడ్డి, ఏఎస్‌ఐ చంద్రబాబు, వెలుగు ఏపీఎం క్రిష్ణప్ప, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ రవికుమార్, దళిత సంఘాల నాయకులు మాకయ్య, మంజునాథ్, అమరనారాయణ, తిప్పయ్య పాల్గొన్నారు.

## ఇంటర్ జోనల్స్ క్రీడోత్సవాలు ప్రారంభం



జోనల్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, డీఈఓ

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఇంటర్ జోనల్స్ క్రీడోత్సవాలను ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జోనల్ క్రీడలకు సంబంధించి నియమ, నిబంధనల పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజుతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి, జిల్లా స్థాయి పోటీల్లో నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. డీవైఈఓ చంద్రశేఖర్, ఎంపీడీఓ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే


సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపంజాణి: మండలంలో శనివారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి పాల్గొన్నారు. చలమంగళం పంచాయతీలోని ముద్దేపల్లి, వద్దూరు, సూలేరు గుట్ట గ్రామాల్లో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు అందజేశారు. గ్రామంలో నీటి సమస్య తీర్చి, రేషన్ షాపు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్, మాజీ ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, నేతలు ఆనంద్, చలపతి, బావాజాన్ పాల్గొన్నారు.

### శిఖండి చిత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరణలో చిత్ర బృందం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం శిఖండి సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. చిత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ కేకే ఫిలిమ్స్ సమర్పణలో కోడి కిషోర్ దర్శకత్వం వహిస్తూ శిఖండి సినిమాలో ప్లాస్టిక్ మహమ్మారిని రూపుమాపాలనే నేపథ్యంలో ఈ సినిమా చిత్రీకరణ సాగిందన్నారు. త్వరలో సినిమాను తెరపైకి తీసుకొస్తామన్నారు. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. నటీనటులు చంద్రశేఖర్, గంజి రామమూర్తి, ఏకే మురుగేషన్, శంకర్, టీపీ శ్రీనివాసులు, విజయకుమార్, పాండురంగన్, నాగ కుమార్, ఉదయ్‌కిరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో సమస్యలు ఉండకూడదు


పుంగనూరు హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణవంశీ

పుంగనూరు: సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి కృష్ణవంశీ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని మేలుపట్లలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు, ప్రాంగణం, గదులను, ఆర్‌ఓ ప్లాంటును ఈసందర్భంగా న్యాయమూర్తి పరిశీలించారు. పాఠశాలలో ఇంకా పారిశుధ్య కార్యక్రమాలు మరింత మెరుగుపరచాలని వార్డెన్‌ను ఆదేశించారు. అలాగే ఆయన విద్యార్థులతో పాఠ్యాంశాలపై చర్చించారు. అలాగే ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే సంబంధిత అధికారులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సమస్యలు పరిష్కారంకాకుంటే మండల న్యాయసేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయాలని న్యాయమూర్తి సూచించారు. అధికారులు హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, హాస్టళ్లలోని పిల్లలను ప్రేమతో చూసుకోవాలని కోరారు.

## మున్సిపల్ కమిషనర్‌కు ఘనంగా వీడ్కోలు


మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించిన ఉద్యోగులు

పుంగనూరు: మున్సిపల్ కమిషనర్‌గా మూడేళ్లు పని చేసి, బదిలీపై చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన నరసింహప్రసాద్‌కు శనివారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌చార్జ్ కమిషనర్ మహేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు, సచివాలయ ఉద్యోగులు కమిషనర్‌కు శాలువలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. కమిషనర్ సేవలను కొనియాడారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో పట్టణాభివృద్ధికి ఇలాగే సహకరించాలని కోరారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఏఈ కృష్ణకుమార్, ఆర్‌ఓ సతీష్‌కమలాకర్, అకౌంటెంట్ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ రమణారెడ్డి, సీవన్ జ్ఞానప్రకాష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కృష్ణవేణి, సర్వేయర్ కిరణ్మయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఏఈ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

# టిడ్‌కో కట్టలేదు..డబ్బూ ఇవ్వలేదు

- నాటి టీడీపీ ప్రభుత్వంలో కట్టిన డబ్బుపై నేటి కూటమిపై ఆశలు
- ఏపీ టిడ్‌కో ఇళ్ల కోసం 2018లో డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు
- నిర్మాణాలకు నోచుకోక అప్పట్లోనే ఆగిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు
- కట్టించుకున్న సొమ్ము కూడా ఇవ్వని వైనం
- మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగి వేసారిన బాధితులు


టిడ్కో గృహాల నిర్మాణానికి మాజీ మంత్రి ప్రారంభించిన శిలాఫలకం (ఫైల్)

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో ఏపీ టిడ్‌కో ద్వారా జీప్లస్ నిర్మాణాలంటూ 2018లో టీడీపీ ప్రభుత్వం మున్సిపాలిటీలో 400 మందిని ఎంపిక చేసింది. గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌కు అడుగులను బట్టి రకరకాలుగా ధర నిర్ణయించారు. ఎంపికైన వారిలో 42మంది రూ.50 లక్షల దాకా అప్పట్లో మున్సిపాలిటీలో చెల్లించారు. కొందరు ఇళ్ల కోసం అప్పట్లో అప్పు చేసి మరీ డబ్బుకట్టారు. అయితే ఆరేళ్లవుతున్నా ఇక్కడ టిడ్కో ఇళ్ల నిర్మాణాలు జరగలేదు. లబ్ధిదారులు కట్టిన నగదు వెనక్కి ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా తాము చెల్లించిన నగదు వెనక్కి వస్తుందేమోనని ఆశగా ఎదురుచూపులు చూస్తున్నారు.

**అప్పుడేం జరిగిందంటే...**

పేదలకు అఫోర్డబుల్ హౌసెస్ నిర్మాణాలకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలమనేరులో భూసేకరణకు ఆదేశించింది. దీంతో రెవెన్యూ అధికారులు, ఏపీ టిడ్‌కో( ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) కలసి పట్టణ సమీపంలోని గడ్డూరు వద్ద సర్వే నంబర్లు 1075,1076,1069లలో రైతుల నుంచి 8.78 ఎకరాలను భూసేకరణ ద్వారా సేకరించారు. ఎకరా రూ.25లక్షలుగా ప్రభుత్వం కొనుగోలు చేసింది. దీంతో 8.78 ఎకరాలకు రూ.2.25 కోట్లను వెచ్చించారు. అప్పట్లో ఎన్నికల కోడ్ కూస్తుందని తెలిసి హుటాహుటిన శిలాఫలకాల వేసి నాటి మంత్రి అమరనాథరెడ్డి సకల సౌకర్యాల గృహనిర్మాణం పేరిట 2019 ఫిబ్రవరి 17న శంకుస్థాపన చేశారు. అనంతరం 2019 ఎన్నికల్లో ప్రభుత్వం మారడం, కరోనా రావడంతో టిడ్కో నిర్మాణాలు కొండెక్కాయి.

**డబ్బు కోసం ఎదురుచూపులు..**

ఇన్నేళ్లవుతున్నా ఇళ్ల నిర్మాణాలు లేక కట్టిన డబ్బు వెనక్కి రాలేదు. దీంతో గత ప్రభుత్వంలో ఐదేళ్ల టిడ్కో లబ్ధిదారులు తాము చెల్లించిన డబ్బు ఇవ్వాలంటూ కాళ్లరిగేలా తిరిగారు. దీనిపై అప్పటి మున్సిపల్ పాలకవర్గం డబ్బును వెనక్కి ఇవ్వాలంటూ తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరిలో ఆశలు చిగురించాయి. ఇప్పటికైనా తాము కట్టిన డబ్బులివ్వండి మహాప్రభోనంటూ ఎదురు చూపులు చూస్తున్నారు. మళ్లీ వీరికి టిడ్కో ద్వారానే ఇళ్ల కట్టిస్తారా? లేక చెల్లించిన డబ్బును వెనక్కి ఇస్తారా వేచి చూడాల్సిందే.

# పింఛన్లు ఊడుతున్నాయ్!

- పలమనేరు మండలంలోనే 55 పింఛన్లు అవుట్
- నియోజకవర్గంలో ఇప్పటికే మొదలైన పింఛన్ల ఏరివేత
- ఒంటరి మహిళలు, బెడ్ పైనున్న వారే అధికారుల టార్గెట్


పలమనేరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: ప్రతినెలా మొదటిరోజు ఇవ్వాల్సిన సామాజిక పింఛన్లను ఓరోజు ముందుగానే ఇస్తున్నారని కొందరు పింఛన్‌దారులు సంతోషపడుతుండగా మొన్న నెలలో ఉన్న పింఛన్ ఈనెలలో ఊడిందని మరికొందరు బాధపడుతున్నారు. ఇది పలమనేరు నియోజకవర్గంలో పింఛన్ల ఏరివేత కార్యక్రమం. ఇప్పటికే ఉన్న పింఛన్లలో నిబంధనల మేరకు లేవని చెప్పి ప్రతినెలా పింఛన్లను తొలగించే ప్రక్రియ గోప్యంగా పలమనేరు నియోజకవర్గంలో సాగుతోంది. ఇలాఉండగా నియోజకవర్గంలో శనివారం సాయంత్రం దాకా పింఛన్ల పంపిణీ ఇలా సాగింది. పలమనేరు మున్సిపాలిటీలో 4,640 పింఛన్లకు 4,079, పలమనేరు మండలంలో మొత్తం పింఛన్లు 4,550కిగానూ 4,020, గంగవరంలో 8,266 పింఛన్లకు 7,265, బైరెడ్డిపల్లిలో 7,749 పింఛన్లకు 6,647, వి.కోటలో11307 పింఛన్లకు 9,371, పెద్దపంజాణిలో 8,268 పింఛన్లకు 7,586 బట్వాడా చేసినట్టు అధికారులు తెలిపారు.

**పలమనేరు మండలంలో 55 పింఛన్లు ఔట్..**

పలమనేరు మండలంలో తాజాగా సామాజిక తనిఖీ బృందం మండలంలోని పది పంచాయతీల్లో పింఛన్లపై విచారణ చేసి ఆ నివేదికను డీఆర్‌డీఏ అధికారులకు అందజేశారు. మృతిచెందిన పింఛన్‌దారులను అప్పటికప్పుడే తొలగిస్తున్నారు. కానీ ఒంటరి మహిళలు, అనారోగ్యంతో మంచానికి పరిమితమైన వారిని టార్గెట్ చేశారు. ఒంటరి మహిళకు భర్తలున్నారని కొన్ని కేసుల్లో, ఆమెకు విడాకుల పత్రం లేదని మరికొన్ని కేసుల్లో పింఛన్లను తొలగించేశారు. ఇక గతంలో మంచానికే పరిమితమై ఇప్పుడు కాస్త కోలుకొని ఉన్న వారిని పూర్తిగా పింఛన్లు తొలగించేశారు. వికలత్వశాతం తక్కువగా ఉన్న వారిని మళ్లీ సదరం సర్టిఫికెట్ తెచ్చుకొని దరఖాస్తు చేసుకోవాలని పింఛన్ తొలగించారు. ఇలా చిన్నమండలమైన పలమనేరులోనే 55 పింఛన్లు తొలగిస్తే ఇక ఐదు మండలాల్లో ఎన్ని పింఛన్లను తొలగించి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. ఏదేమైనా కూటమి ప్రభుత్వంలో పింఛన్ల ఏరివేత నిరంతర ప్రక్రియలా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.